సుభాష్ చంద్రబోస్ జయంత్యుత్సవం



సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసిన బీసీ సంక్షేమ సంఘం నేతలు



నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతాజీ సేవాదళం సభ్యులు



ఈమని పాఠశాలలో నేతాజీ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరిస్తున్న మొవ్వా వృషాద్రిపతి

మంగళగిరి: ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంత్యుత్సవం సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో జరిగింది. ఆయన విగ్రహాలకు ప్రజలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంలోని పాత మంగళగిరి భద్రావతి సమేత భావనారుషి స్వామి దేవస్థానం, లక్ష్మీ నృసింహస్వామి ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు వుట్ల పాల శ్రీనివాస్, లక్ష్మీనృసింహస్వామి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ప్రొఫెసర్ మేకల మోహనరావు సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింహాద్రి శ్రీనివాసరెడ్డి, వెనిగళ్ల కృష్ణమూర్తి, తెంపల్లి దుర్గారావు, గుడిపూడి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అన్నం నాగబాబు. జొన్నాదుల రామాంజనేయులు, తిరువీధుల కిరణ్, ఆలా శివాజీ, మహిళా విభాగం నాయకురాలు కాగితాల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో..

తాడేపల్లిరూరల్: తాడేపల్లి నేతాజీ సెంటర్‌లో నేతాజీ సేవా దళం గౌరవ అధ్యక్షులు శ్రీరామ్ నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టి.నాగేశ్వరరావు, సాంబశివరావు నేతాజీ సేవాదళం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఈమనిలో..

దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో విలేజ్ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో ఈమని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం నేతాజీ జయంతిని నిర్వహించారు. ఫోరం కన్వీనర్ ఇంగువ విష్ణుమూర్తి నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశిష్ట అతిథులుగా ఉగాది, తెలుగు విశ్వ విద్యాలయ పురస్కారాలు అందుకున్న మొవ్వా వృషాద్రిపతి, తుమ్మపూడి కోటేశ్వరరావు విచ్చేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడు కొండలు విద్యార్థులకు నేతాజీపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.మురళీకృష్ణ, వెంపటి సుబ్బారావు, ఫోరం ప్రతినిధులు ఎ.వెంకటేశ్వరరావు, కొండూరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమావేశం

ఏర్పాట్లను పరిశీలించిన పార్టీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్



వేదికను పరిశీలిస్తున్న నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: తాడికొండలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు పార్టీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు తాడికొండ అడ్డరోడ్డులోని వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు. సమావేశానికి పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్లు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, మర్రి రాజశేఖర్, నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి పలువురు నాయకులు హాజరుకానున్నారని వివరించారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులకు వీరు దిశానిర్దేశం చేస్తారని వివరించారు.

శ్మశాన వాటిక అభివృద్ధి పనులు



ఉండవల్లి శ్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి హిందూ శ్మశాన వాటిక ఆక్రమణలకు గురికావడంతో ఆ ప్రాంత ప్రజలు శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)కు గతంలో వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన కార్పొరేషన్ నుంచి రూ.10 లక్షల నిధులు కేటాయించారు. సుమారు 80 అడుగుల పొడవున, 14 అడుగుల ఎత్తులో శ్మశాన వాటిక గోడ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులు సోమవారం నుంచి శరవేగంగా జరుగుతున్నాయి. గోడ కట్టిన అనంతరం శ్మశాన వాటిక పల్లంగా ఉండడంతో గ్రావెల్ కూడా తోలించాలని ఆ ప్రాంత ప్రజలు అధికారులకు వినతి పత్రం సమర్పించారు. మరో రూ.5 లక్షల వ్యయంతో గ్రావెల్ ఫిల్లింగ్‌తోపాటు వసతి గృహాన్ని కూడా నిర్మించనున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ



చిత్రలేఖనంలో బహుమతులు పొందిన విద్యార్థినులు

తాడేపల్లిరూరల్ : రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీలలో ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత స్వాతంత్య్ర సమరయోధులు అనే అంశంపై వినుకొండలో ఈనెల 21న బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీలలో వడ్డేశ్వరం ఉన్నత పాఠశాల నుంచి మొత్తం 78 మంది విద్యార్థులు పాల్గొనగా, 12 మంది వడ్డేశ్వరం పాఠశాల విద్యార్థినులు బహుమతులు పొందారని వివరించారు. 9వ తరగతి విద్యార్థిని ఝాన్సీలక్ష్మీబాయి చిత్రం గీసి బాలచిత్ర కళాప్రవీణ అవార్డుతోపాటు రూ.500 నగదు బహుమతి దక్కించుకుందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహించిన చిత్రలేఖన ఉపాధ్యాయులు సిహెచ్.వి.ఆర్.సత్యనారాయణను, విజేతలను ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఇ.లక్ష్మీ నారాయణ, సుందరరాజు, వసంతరావు తదితరులు అభినందించారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణంలో హామీ పత్రాలు ఇచ్చిన పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లిలోని ఎంటీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 2016 కృష్ణా పుష్కరాల సందర్భంగా ఇళ్లు తొలగించిన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని, రైల్వే స్థలాలను రెగ్యులరైజ్ చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నులకపేట ఫారెస్ట్ ప్రాంతాన్ని డీ ఫారెస్ట్ చేసి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, సుందరయ్య నగర్, మహానాడు ప్రాంతాల్లో అసైన్డ్ ల్యాండ్ రెగ్యులరైజేషన్ చేయాలని కోరారు. చెత్తపన్నును రద్దు చేయాలని విన్నవించారు. దళితులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం తాడేపల్లి రూరల్ మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, కొట్టే కరుణాకరరావు, వేముల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై వార్డెన్ భర్త అసభ్య ప్రవర్తన

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : దుగ్గిరాల మండల కేంద్రం సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ బాలికల వసతి గృహంలో దారుణం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దుగ్గిరాల బాలికల హాస్టల్‌లో వార్డెన్‌గా పనిచేస్తున్న భవానీ భర్త రాయపాటి పవన్‌కుమార్ ఆమెతోపాటే హాస్టల్‌లో ఉంటున్నాడు. తాడేపల్లికి చెందిన ఓ బాలిక జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి చదువుతూ ఈ హాస్టల్లో వసతి పొందుతోంది. శనివారం వార్డెన్ ఫోన్ నుంచి తల్లిదండ్రులకు బాలిక ఫోన్ చేస్తుండగా, వెనుక నుంచి వచ్చిన వార్డెన్ భర్త రాయపాటి పవన్‌కుమార్ ఆ బాలికను పట్టుకుని ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ ఘటనపై శనివారం రాత్రి ఆ బాలిక తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసింది. ఆదివారం తల్లిదండ్రులు దుగ్గిరాల హాస్టల్‌కు వచ్చి బాలిక చేత దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. పవన్‌కుమార్‌పై పోక్సో చట్టం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పవన్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఘటనపై విద్యాశాఖ అధికారులూ దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం పెనుమాక–యర్రబాలెం మధ్య గల మామిడితోటలో సందడిగా సాగింది. దాదాపు 25 ఏళ్ల తరువాత దేశ విదేశాల్లో, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో స్థిరపడిన స్నేహితులంతా కలవడంతో నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆద్యంతం ఉల్లాసంగా, సంతోషంగా గడిపారు. న్యూజిలాండ్, స్కాట్లాండ్ దేశాల నుంచి సెలవుపై వచ్చిన నాయుడు ప్రసాద్, గడ్డం నాగరాజును చూసి మిత్రులు పులకించిపోయారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. గ్రూపు ఫొటో దిగారు.

ఇదొక మధురానుభూతి



ఉద్యోగం నిమిత్తం న్యూజిలాండ్‌లో ఉంటాను. చిన్ననాటి స్నేహితులందరినీ కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ రోజు జీవితంలో మరిచిపోలేని జ్ఞాపకంగా ఉండిపోతుంది. తాను ఇండియాకు వచ్చానని తెలిసి ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన స్నేహితులందరికీ ధన్యవాదాలు.

– నాయుడు ప్రసాద్, న్యూజిలాండ్

సంతోషంగా ఉంది



పెనుమాక ఎల్ఈ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నా. 25 ఏళ్ల తరువాత అప్పటి మిత్రులను కలుసుకోవడం సంతోషంగా ఉంది. కొందరం స్థానికంగానే ఉన్నా.. ఉద్యోగాల్లో బిజీగా ఉండడంతో కలుసుకున్న సందర్భాలు తక్కువ. ఇంత కాలానికి అందరం కలసి సహపంక్తి భోజనాలు చేయడం మధురానుభూతి.

– చిమటా శ్రీనివాసరావు, యర్రబాలెం

కాలనీల్లో వసతులు కల్పించాలని వినతి

తాడేపల్లిరూరల్ : జగనన్న కాలనీల్లో వసతులు కల్పించాలని దుగ్గిరాల మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చిలువూరు, ఈమని గ్రామాల్లోని సచివాల కార్యదర్శులకు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ కాలనీల్లో పరిస్థితులను వివరించారు.

మందడంలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం



తాడికొండ: తుళ్ళూరు మండలం మందడం గ్రామ పరిధిలో తాళ్ళాయపాలెం రోడ్డు వెంట గుర్తు తెలియని 30 ఏళ్ల యువకుడు మృతదేహం లభించినట్లు తుళ్ళూరు సీఐ ఆనందరావు తెలిపారు. యువకుడు వయస్సు 30 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై డెమో అనే ఇంగ్లిషు అక్షరాలు గల కట్ డ్రాయర్ మాత్రమే ఉందని పేర్కొన్నారు. కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో బట్టలు లేకుండా తిరిగినట్లు స్థానికులు తెలిపారని, వీఆర్వో ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటయ్య ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తుళ్ళూరు ఠాణాలో సంప్రదించాలని ఆయన సూచించారు.

వలంటీర్ ఖాళీల కోసం దరఖాస్తుల ఆహ్వానం

మేడికొండూరు/ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాలలో ఖాళీగా ఉన్న వలంటీర్ స్థానాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.శోభారాణి సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. వివరాలకు మండల పరిషత్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఫిరంగిపురం గ్రామ పంచాయతీలో మూడు వలంటీర్ స్థానాల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో డి.అనూరాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు ఈనెల 27వతేదీలోగా దరఖాస్తులను తమ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

బియ్యం మాఫియా కేసులో నిందితుడి అరెస్ట్

కాపుకాసి చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బియ్యం మాఫియా నాయకుడిగా వ్యవహరిస్తు పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తిని సోమవారం తాడేపల్లి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. తాడేపల్లి సీఐ శేషగిరిరావు కథనం ప్రకారం.. యర్రబాలెంకు చెందిన సాంబశివరావు పలుచోట్ల రేషన్ బియ్యాన్ని సేకరించి అమ్ముతుంటాడు. పలుచోట్ల బియ్యం వాహనాలు పట్టుకున్న ఘటనల్లో ఇతను తప్పించుకున్నాడు. గత ఆరునెలలుగా పోలీసులకు దొరకకుండా తిరుగుతున్నాడు. దీంతో ఇతడి కదలికలపై తాడేపల్లి క్రైం పోలీసులు నిఘా వేశారు. ఈ క్రమంలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ గంగరాజు ద్విచక్రవాహనంపై వెళుతున్న సాంబశివరావును గుర్తించి అతడ్ని వెంబడించి తాడేపల్లిలో అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకు వచ్చారు. సాంబశివరావుపై ఉన్న నాలుగు కేసుల్లో అతడ్ని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు సీఐ శేషగిరిరావు తెలిపారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

గుంటూరు ఈస్ట్: పేకాట ఆడుతున్న ఐదుగురిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చైతన్యపురం కాలనీ సాయిబాబా దేవాలయం ప్రాంతంలోని ఓ నివాసంలో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సోమవారం దాడిచేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 57 వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

పట్నంబజారు: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసుల కథనం ప్రకారం.. సంపత్‌నగర్ రామనామక్షేత్రం ప్రాంతానికి చెందిన మామిడి సుధీర్ కుమార్ (29) నల్లచెరువుకు చెందిన ఓ వివాహితతో కొంత కాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు మందలించి, సాఫ్ట్‌వేర్ కోచింగ్ నిమిత్తం కొద్దికాలం హైదరాబాద్‌కు పంపారు. తిరిగి వచ్చిన సుధీర్‌కుమార్ వివాహిత నివాసానికి వెళ్లి ఉరి వేసుకుని మృతి చెందాడు. సోమవారం విషయం తెలుసుకున్న మృతుడి తండ్రి వేదాద్రిశర్మ కుమారుడి మృతిపై అనుమానం ఉందని పోలీసులు ఫిర్యాదు చేశారు.

కౌన్సిల్ మెంబర్‌గా నేతాజీ

పాతగుంటూరు: సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వై.నేతాజీ సీఐటీయూ జాతీయ జనరల్ కౌన్సిల్ మెంబర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న బెంగళూరులో జరిగిన సీఐటీయూ 17వ అఖిలభారత మహాసభలో ఆయన్ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

తాడేపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రామ్‌ప్రసాద్



తాడేపల్లిరూరల్: తాడేపల్లి తహసీల్దార్ శ్రీనివాసులు రెడ్డి పదోన్నతిపై బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా జి.వి.రామ్‌ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళగిరి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూనే తాడేపల్లిలో కూడా ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరిస్తానని వెల్లడించారు.

కొలనుకొండలో సీసీ రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కొలనుకొండలో మరో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం అధికారులు శ్రీకారం చుట్టారు. 16వ నంబర్ జాతీయ రహదారి నుంచి కొలనుకొండలోని గంగానమ్మ పేట ఎంపీపీఎస్ స్కూల్ వరకు సుమారు 800 మీటర్ల పొడవు 4 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి మంగళగిరి కార్పొరేషన్ అధికారులు పనులు చేపట్టారు. నిర్మించే రోడ్డు గోతుల మయంగా ఉండడంతో ముందుగా గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేసి దానిని పూర్తిస్థాయిలో రోలింగ్ చేసి వారం పదిరోజుల్లో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



మంగళగిరి: గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో ఈనెల 22న జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో నగరంలోని అమరావతి తైక్వాండో క్లబ్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కోచ్ పి.సుబ్బారావు సోమవారం తెలిపారు. క్యాడెట్ బాయ్స్ విభాగంలో బాలాజీశ్వర్, మోహినిష్, వర్షిత్‌కుమార్, అక్షిత్ కుమార్, లక్ష్మీ నరసింహ, బాలికల విభాగంలో తులసి, తేజశ్రీ, డింపుల్ భవానీ, గాయత్రి బంగారు పతకాలు సాధించినట్లు వెల్లడించారు. జూనియర్, సీనియర్ విభాగంలో వినోద్‌పాల్, హర్షవర్ధన్, హారిక, సౌజన్య బంగారు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు ఈనెల 29, 30, 31 తేదీల్లో అనకాపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ సుబ్బారావు పేర్కొన్నారు.

పైప్‌లైన్లకు మరమ్మతులు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి 16వ వార్డులో కొండ పైభాగానికి వెళ్లే తాగునీటి పైపులైన్లు తుప్పు పట్టి నీరు వృథాగా డ్రెయినేజీలో కలుస్తుండడంతో సోమవారం కార్పొరేషన్ సిబ్బంది 16వ వార్డులోని ఎనిమిది చోట్ల లీకవుతున్న పైపులను గుర్తించి, నీళ్లు పోతున్న ప్రాంతాల్లో పైపులు తొలగించి కొత్త పైపులు వేసి వెల్డింగ్ పనులు చేపట్టారు. తాగునీరు వృథా కాకుండా ఈ పనులు చేపట్టినట్లు తాగునీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి వెంకటరెడ్డి తెలిపారు.

బీసీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి



పి.జోసఫ్

ఫిరంగిపురం: బీసీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషిచేస్తున్నట్లు రాష్ట్ర బీసీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోలిశెట్టి జోసఫ్ చెప్పారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 2022తో ముగిసిన తన పదవీ కాలాన్ని పొడిగించినందున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పోలిశెట్టి జోసఫ్ కృతజ్ఞతలు తెలిపారు. డైరెక్టర్ల పదవీ కాలాన్ని మరో రెండేళ్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని వివరించారు.

27న మేడికొండూరు మండల సర్వసభ్య సమావేశం

మేడికొండూరు: మేడికొండూరు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 27న జరపనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి ఎం.శోభారాణి తెలిపారు. ఈ సందర్భంగా గత సమావేశంలో తీసుకున్న లక్ష్యాలపై వివరణతో అధికారులు హాజరుకావాలని తెలిపారు. సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వార్డుమెంబర్లు హాజరవుతారని వివరించారు.

రేపు భద్రావతీ సమేత భావనారుషి కల్యాణం

మంగళగిరి: నగరంలోని పాత మంగళగిరి పద్మశాలీయ బహూత్తమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25న శ్రీ భద్రావతీ సమేత భావనారుషి కల్యాణం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి కల్యాణాన్ని తిలకించాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

మంగళగిరి: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సోమవారం మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఎంటీఎంసీ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల డిమాండ్‌లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి దూపాటి శివశంకర్, ఉపాధ్యక్షులు కటారి శ్రీనివాసరావు, కురగంటి యేసు, కటారి ఆంజనేయులు, బంగారు జ్యోతి, దళాయి అంజమ్మ, కేసం దేవమాత తదితరులు పాల్గొన్నారు.

కొలనుకొండకు తాగునీటి సరఫరా పునరుద్ధరణ

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండలో వారం రోజుల నుంచి పైపులైన్ల మరమ్మతుల కారణంగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సోమవారం కొలనుకొండ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ క్రాంతి ఆధ్వర్యంలో ఆ సమస్యను పరిష్కరించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. గంగానమ్మ పేట పైపులైన్లలో ఎయిర్ సమస్య తలెత్తడంతో తాగునీటి సరఫరా కాలేదని, నాలుగు రోజులుగా పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టినట్లు క్రాంతి వెల్లడించారు.

27,28 తేదీల్లో కబడ్డీ, ఖోఖో పోటీలు

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం డాన్‌బాస్కో ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 27,28 తేదీల్లో కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు ఫాదర్ చిన్నప్ప, ఫాదర్ జోస్ తెలిపారు. సోమవారం పాఠశాల ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటలీ దేశానికి చెందిన విద్యావేత్త పునీత జాన్ బాస్కో వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ పోటీలకు ప్రతి ఒక్క పాఠశాల నుంచి ఒక బాలుర, బాలికల జట్టు మాత్రమే పాల్గొనాలని, పాల్గొనదలచిన జట్టు ఒక్క ఆటకు రూ.300 చెల్లించాలన్నారు. ఈ నెల 24న పాఠశాల ఆవరణలో డ్రా తీస్తామని వెల్లడించారు. ఆసక్తి కలిగిన పాఠశాల విద్యార్థులు క్రీడా పోటీలకు హాజరు కావాలని కోరారు.

వడ్డేశ్వరంలో ముగిసిన వాలీబాల్ పోటీలు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో సంక్రాంతి పండగ సందర్భంగా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా నాయకులు కత్తిక మలికార్జునరావు (బుల్లబ్బాయి), ఫణీంద్రబాబు మెమోరియల్ నిర్వహించిన వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉపాధ్యాయ మాజీ రంజీ ట్రోఫీ ప్లేయర్, ఎస్సార్ యూనివర్శిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌తోపాటు కత్తిక మల్లికార్జునరావు విజేతలకు మొదటి బహుమతిగా రూ.20,116, రెండో బహుమతిగా రూ.10,116 అందజేశారు. కార్యక్రమంలో వడ్డేశ్వరం గ్రామ పెద్దలు, డాక్టర్ విజయ్ సైన్, ఆర్గనైజర్ గుంపెన గోపి, గుంపెన చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నిందితుడి సమాచారం తెలియజేయాలి

గుంటూరు ఈస్ట్: కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న నిందితుడి వివరాలు తెలియజేయాలని అరండల్‌పేట పోలీసులు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. కొరిటెపాడు నాయుడుపేటకు చెందిన గ్రంధి రవికుమార్ అలియాస్ ప్రసాద్, అలియాస్ అబ్దుల్ రెహమాన్ తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా నేరేచర్ల పోలీసు స్టేషన్ పరిధిలో ఓ కేసులో నిందితుడు. ఇతడి సమాచారం తెలిసిన వారు నేరేడుచర్ల పోలీసు అధికారి సెల్. 9440700085 నెంబరుకు సమాచారం తెలపాలని కోరారు.